క్లుప్తంగా

25న వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం


సూర్యనారాయణరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు

భోగాపురం: మండలంలోని సవరవిల్లి పంచాయతీలో వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం, బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలు ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. రావాడ, తూడెం, కవులవాడ, పోలిపల్లి, లింగాలవలసల్లో జరిగే ఈ కార్యక్రమాలకు పార్టీ శ్రేణులంతా హాజరుకావాలని కోరారు.

కమిషనర్‌గా అదనపు బాధ్యతలు


బాధ్యతలు చేపట్టిన జయరాం

నెల్లిమర్ల: నగరపంచాయతీ కమిషనర్‌గా కార్యాలయ మేనేజర్ తుమ్మి జయరాంకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు ఆయన కమిషనర్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన తారక్‌నాథ్ ఈ నెల 15వ తేదీన లంచం తీసుకుంటుండగా ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో జయరాంకు బాధ్యతలు అప్పగించారు. గతంలో కూడా ఈయన కొంత కాలం పాటు కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించారు.

నోటుపుస్తకాల వితరణ


నోటుపుస్తకాలు చూపిస్తున్న విద్యార్థులతో దాతలు, ఉపాధ్యాయ సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని తంగుడుబిల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పువ్వాడ చారిటబుల్ ట్రస్ట్ వారు నోటుపుస్తకాలు సోమవారం వితరణ చేశారు. ఒక్కో విద్యార్థికి మూడేసి చొప్పున 41 మంది విద్యార్థులకు ఈ పుస్తకాలు అందజేసినట్లు దాతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాల ఆర్థికాభివృద్ధికి సూక్ష్మరుణ ప్రణాళికలు


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సావిత్రి

విజయనగరం అర్బన్: పొదుపు సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి సెర్ప్ ద్వారా సూక్ష్మ రుణ ప్రణాళికలు, ఏసీఎల్‌పీ(యాన్యువల్ క్రెడిట్ అండ్ లైవ్లీహుడ్ ప్లాన్) పథకాలు అమలు చేయడం జరుగుతోందని డీఆర్‌డీఏ పీడీ కె.సావిత్రి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన జిల్లా స్థాయి అధికారుల సమావేశంలో డీఆర్‌డీఏ ద్వారా అమలవుతున్న పథకాలు, కార్యక్రమాలను ఆమె వివరించారు. పొదుపు సంఘాల వారికి బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతిల ద్వారా అధిక మొత్తంలో రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ రుణాలను సభ్యుల ఆర్థికాభివృద్ధికి వినియోగపడేలా తద్వారా వారి ఆర్థిక ప్రగతి సాధనే సదరు పథకాల లక్ష్యమన్నారు. సమావేశంలో కేఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు ఇంటి పన్ను మినహాయింపు

- కొత్తవలస మేజర్ పంచాయతీ తీర్మానం


నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సర్పంచ్‌కు వినతిపత్రం అందజేస్తున్న చిరు వ్యాపారులు, షాపుల యజమానులు

కొత్తవలస: కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధిలో నివాసం ఉంటున్న మాజీ సైనిక ఉద్యోగులకు ఇంటిపన్ను మినహాయింపు చేస్తూ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి అధ్యక్షతన సోమవారం జరిగిన సాధారణ సమావేశంలో తీర్మానించారు. అలాగే మరిన్ని తీర్మానాలు చేస్తూ సభ్యులు ఆమోదించారు. అనుమతుల్లేని లే అవుట్లలో ఇళ్లు నిర్మించుకున్న వారికి ఉడా నిబంధనల మేరకు 14 శాతం ఫీజుతో ఇంటి పన్ను వసూలు చేయాలని నిర్ణయించారు. అర్థన్నపాలెం గ్రామ సమీపంలో గల డంపింగ్‌యార్డును మరోచోటుకు తరలించేందుకు అనువైన స్థలం మంజూరుకు తహసీల్దార్‌ను కోరనున్నారు. అనంతరం కొత్తవలస జంక్షన్‌లో కొద్దిపాటి వర్షానికే నీరు నిలిచిపోతోందని, నివారణ చర్యలు చేపట్టాలని కోరుతూ పలువురు చిరు వ్యాపారులు, షాపుల యజమానులు సర్పంచ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు వార్డు సభ్యులు, ఈఓ శైలజా, తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాలే పెట్టుబడిగా చంద్రబాబు పాలన


రెల్లివలస సభలో కూటమి మోసపూరిత పాలనను నిలదీస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ: అబద్ధాలను పెట్టుబడిగా పెట్టి, పరిపాలన సాగిస్తున్న ఏకైక వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే ఈ దేశంలో అది చంద్రబాబు ఒక్కరేనని నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడ్డుకొండ అప్పలనాయుడు విమర్శించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రెల్లివలస, కుమిలి, బత్తివలస, సీహెచ్ అగ్రహారం, పూసపాటిరేగ, కొవ్వాడ అగ్రహారం గ్రామాల్లో సోమవారం పర్యటించిన ఆయనకు గ్రామస్తుల నుంచి ఘనస్వాగతం లభించింది. కూటమి మోసాలు వివరిస్తూ ఇంటింటికీ వెళ్లిన ఆయనకు మహిళలు హారతులిచ్చి ఘనస్వాగతం పలికారు. చంద్రబాబు పాలనలో పడుతున్న కష్టాలను చెప్పుకున్నారు. ఆయన కూడా అబద్ధాలు, మోసాలతో చంద్రబాబు సర్కారు ప్రజలకు చేస్తున్న నయవంచనను కళ్లకుకట్టినట్లు తెలియజేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో ఆయన పాల్గొని, కూటమి పాలనపై మండిపడ్డారు. గతంలోని వైఎస్సార్ సీపీ హయాంలో సీఎంగా జగనన్న రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతూ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగించారన్నారు. ఇప్పుడు కూటమి హయాంలో అటు అభివృద్ధి లేదు..ఇటు సంక్షేమమూ లేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఎన్నికల హామీలేవీ పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని, ఇచ్చిన ఒకట్రెండు పథకాలు కూడా అరకొరగా అమలు చేశారని దుయ్యబట్టారు. అధికారం కోసం టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడి అమలు సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకున్నారని, తీరా అధికారంలోకి వచ్చాక ఓట్లేసిన జనాన్ని, వారికిచ్చిన హామీల అమలును నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమన్నారు. ప్రజలను ఏ విధంగా మోసం చేయాలో చంద్రబాబుకు బాగా తెలుసని, ఆయనకు అది వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు.


బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ, తదితరులు

రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు..

అమరావతి, పోలవరం పేరిట కూటమి నాయకులు ప్రజలను మోసం చేస్తూ రాష్ట్రాన్ని దోచుకుతింటున్నారని ఆరోపించారు. చంద్రబాబు కూడా తన వారికి మాత్రమే కడుపు నింపుతున్నారని, ప్రజలను పట్టించుకోవడం లేదన్నారు. ఆడబిడ్డలకు ప్రతినెలా ఇస్తానన్న రూ.1500, మహిళలకు ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ వంటి హామీలు ఎప్పుడు అమలు చేస్తారని నిలదీశారు. స్థానిక ఎమ్మెల్యే లోకం నాగమాధవి కూడా నియోజకవర్గ ప్రజలు, నిరుద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చారని, ఇప్పటివరకు ఏ హామీ అమలు చేయలేదని ధ్వజమెత్తారు. తాను గెలిస్తే వంద రోజుల్లో వంద కంపెనీలు తెచ్చి వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలిస్తామన్నారని ఆమె ఇప్పటివరకు ఇచ్చిన ఉద్యోగాలెన్నో.. ఎవరెవరికి ఉద్యోగాలిచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఇప్పటి కూటమి పాలనకు ఉన్న తేడాను ప్రజలంతా గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో వారే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కల్యాణి, జెడ్పీటీసీ మహంతి సీతాలక్ష్మి, వైస్ ఎంపీపీ అల్లాడ రమేష్, నాయకులు ఎం.శ్రీనివాసరావు, ఎం.జనార్దనరావు, ఆర్.శ్రీనివాసరావు, జి.సురేష్‌రెడ్డి, బి.చినఅప్పన్న, డి.త్రినాథరావు, జి.సూరప్పన్నరెడ్డి, కె.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయించే బాధ్యత వైఎస్సార్ సీపీది..


సభలో కూటమి పాలనకు, వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న తేడాను వివరిస్తున్న మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: అధికారం దాహం తీర్చుకుని, హామీల అమలు విస్మరించిన కూటమి ప్రభుత్వంచే ఎన్నికల హామీలన్నీ అమలు చేయించే బాధ్యతను వైఎస్సార్ సీపీ తీసుకుందని ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నగరంలోని 47వ డివిజన్‌లో సోమవారం పర్యటించిన ఆయనకు స్థానికుల నుంచి ఘన స్వాగతం లభించింది. అనంతరం కార్పొరేటర్ పట్నాన పైడిరాజు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి, ఏడాది కాలంలో చంద్రబాబు సర్కారు ప్రజలను మోసగిస్తున్న తీరును వివరించారు. ఆ తర్వాత జరిగిన సభలో ఆయన కూటమి పాలనపై మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఓట్లు కోసం నోటికి వచ్చిన హామీలన్నీ ఇచ్చేశారని, తీరా అధికారంలోకి వచ్చాక వాటిని ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

డైవర్షన్ పాలిటిక్స్‌తో పాలన భ్రష్టు..

గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదికే అన్ని పథకాలు అమలు చేసి చూపించిందని, ఇప్పటి కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి 13 నెలల కాలం గడిచినా ఎందుకు పథకాలన్నీ అమలు చేయడం లేదని నిలదీశారు. ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.1500, మహిళలకు ఉచిత బస్సు, బీసీలకు 50 ఏళ్లకు పింఛన్, నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. ఇవేవీ అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్‌తో రాష్ట్ర పాలనను భ్రష్టు పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. మోసం చేయడం చంద్రబాబు నైజమని, ప్రజలను ఏ విధంగా మోసం చేయాలో ఆయనకే బాగా తెలుసని ధ్వజమెత్తారు. అన్యాయం పాలవుతున్న జనం పక్కన వైఎస్సార్ సీపీ ఎప్పుడూ ఉంటుందని, వారికి ఇచ్చిన ప్రతి హామీ అమలు జరిగేలా చర్యలుంటాయన్నారు. కూటమి మెడలు వంచైనా ఎన్నికల హామీలు అమలు చేసే దిశగా వైఎస్సార్ సీపీ పోరాటం ఉంటుందన్నారు. గతంలోని జగనన్న పాలనకు ఇప్పటి చంద్రబాబు పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు.


సభలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల, నాయకులు

ప్రజల్లో తలెత్తుకోలేకపోతున్నారు..

సీఎం చంద్రబాబును నమ్మి.. టీడీపీ నాయకులు, కార్యకర్తలే తాము మోసపోయామని మొత్తుకుంటున్నారన్నారు. ఏం ఇచ్చామని, ఏం చేశామని ప్రజల్లోకి వెళ్లాలని.. జనంలోకి తాము వెళ్లలేమని ముఖం చాటేస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు కూటమి హామీలకు అమలు తాము గ్యారెంటీ అని బాండ్‌లు ఇచ్చి మరీ ప్రచారం చేశామని, ఇప్పుడు ఆ పథకాలేవీ వారికి ఇవ్వకుండా ఉంటే ముఖాన ఉమ్మేసే దుస్థితి ఉందని కూటమి కార్యకర్తలే వాపోతున్న పరిస్థితి నెలకొందన్నారు. అధికారం కోసం ఏ పార్టీ నాయకులు, కార్యకర్తలైనా మోసం చేసే సత్తా చంద్రబాబుకు ఉందని, ఆయనను నమ్మి మరోసారి మోసపోయామని ప్రజలే అనుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఫ్లోర్ లీడర్ శెట్టివీర వెంకటరాజేష్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారునాయుడు, యువజన విభాగం ఇన్‌చార్జ్ జి.ఈశ్వర్‌కౌశిక్, కార్పొరేటర్లు ఎస్.నారాయణస్వామి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు కేసులు పెడితే చూస్తూ ఊరుకోం..


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ

పూసపాటిరేగ: దళితులంటే తనకు ఎనలేని అభిమానమని, వారిని అడ్డం పెట్టుకుని తనపై గానీ తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై గానీ తప్పుడు కేసులు పెడితే చూస్తూ ఊరుకోబోమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడ్డుకొండ అప్పలనాయుడు హెచ్చరించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కుమిలి గ్రామంలో సోమవారం జరిగిన సభలో జనసేన పార్టీ నాయకుడు లోకం ప్రసాద్ తీరుపై మండిపడ్డారు. కూటమి పాలనలో ప్రజలు ఏ విధంగా వంచనకు గురవుతున్నారన్న దానిని ప్రతిపక్ష నాయకులు వివరిస్తుంటే అది చూసి ఓర్వలేక కుట్రపూరిత రాజకీయాలకు ప్రసాద్ తెరతీస్తున్నారని ధ్వజమెత్తారు. అమాయకులైన దళితులను పావులుగా చేసుకుని తప్పుడు కేసులు బనాయించి వేధించాలని చూడడం సరికాదన్నారు. తాము కూడా కిందిస్థాయి నుంచి వచ్చిన వాళ్లమేనని, కేసులకు భయపడేది లేదన్నారు. అదే నీ మీద కేసు పెడితే ఇమ్మిగ్రేషన్ అధికారులు అమెరికా వెళ్లకుండా చేస్తారు తెలుసా అని దుయ్యబట్టారు. ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టిపెట్టాలని, దుర్మార్గపు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, మహంతి జనార్దనరావు తదితరులు ఉన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ అక్రమం..

పూసపాటిరేగ: రాష్ట్రంలో అక్రమ అరెస్ట్‌లతో కూటమి ప్రభుత్వం చేస్తున్న కక్షపూరిత రాజకీయాలు చూస్తుంటే ప్రభుత్వ, రాజ్యాంగ వ్యవస్థలపై నమ్మకం సన్నగిల్లుతోందని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రెల్లివలసలో జరిగిన సభలో ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్‌పై ఆయన స్పందించారు. లేని మద్యం స్కామ్ జరిగినట్లు చెబుతూ ప్రతిపక్ష నాయకులపై అధికార పార్టీ కేసులకు ఎగబడుతుండడం దుర్మార్గమేనన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగ పాలనలో భాగంగానే తమ పార్టీ నాయకులను అరెస్ట్ చేస్తున్నారన్నారు. రాజకీయ కక్షలు తీర్చుకునేందుకే కూటమి అధికారంలోకి వచ్చినట్లు ఉందని ఎద్దేవా చేశారు. ప్రజలంతా రాజకీయాలు గమనిస్తున్నారని, వారే సమయం చూసి బుద్ధి చెబుతారన్నారు.

కరెంట్ కష్టాలు..

భోగాపురం: మండలంలోని తోటవీధి సహా మరి కొన్ని వీధుల ప్రజలను కరెంట్ కష్టాలు వీడడం లేదు. తరచూ తమ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. ఇదిలా ఉంటే ఆదివారం రాత్రి 9 గంటల నుంచి సోమవారం సాయంత్రం 6 గంటలకు వరకు కొన్ని గ్రామాలకు కరెంట్ సరఫరా కాకపోవడంతో ఉక్కపోత, దోమలతో గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. ప్రతిసారి ఇలాగే జరుగుతున్నా విద్యుత్ పునరుద్ధరణ చర్యలు మాత్రం చేపట్టడం లేదని, ఇంత నిర్లక్ష్యమా అని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కరెంట్ అవస్థలు లేకుండా చూడాలని కోరుతున్నారు.

జీతాలు చెల్లించడంలో తాత్సారం తగదు..

గజపతినగరం: ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీ నెపంతో ప్రభుత్వం జీతాలు నిలిపి వేయడం సరికాదని ఎస్టీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.చంద్రరావు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు జూన్, జూలై జీతాలు కూడా అందలేదన్నారు. సమస్య పరిష్కారం కానిఎడల ఉద్యమం చేపట్టక తప్పదన్నారు.

సారా పట్టివేత

గుర్ల: మండలంలోని దేవునికణపాకలో 40 లీటర్ల సారా తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై పి.నారాయణరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పరిసరాల్లో సోమవారం తనిఖీలు చేపడుతుండగా.. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు సారా తరలిస్తూ పట్టుబడ్డారన్నారు.

ముందస్తు నోటీసులు ఇవ్వండి


మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

- నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య

విజయనగరం: వర్షాల వల్ల ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పురాతన భవనాలు, నిర్మాణాల యజమానులకు ముందస్తు నోటీసులు జారీ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఇదే విషయమై ఆయన నగరంలోని తన కార్యాలయంలో ప్రణాళిక సిబ్బంది, సచివాలయ కార్యదర్శులతో సోమవారం సమావేశమయ్యారు. రోజూ పడే వర్షాలకు తడుస్తూ ఉండడం వల్ల పురాతన భవనాలు కూలిపోయే అవకాశం ఉందన్నారు. ప్రతిరోజూ క్షేత్ర స్థాయిలో పర్యటించి, అటువంటి భవనాలు ఎక్కడున్నాయో గుర్తించి వాటి యజమానులకు విషయం తెలియజేయాలన్నారు. ఎక్కడైనా భవన వ్యర్థాలు ఉన్నట్లు గుర్తిస్తే వారికి అపరాధ రుసుం విధించాలన్నారు. పురాతన భవనాలపై హోర్డింగ్‌లు ఉండకుండా చూడాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లాన్ హరిబాబు, టీపీవో అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

• ధర్నా



తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ జిల్లా యూనియన్ నాయకులు సోమవారం ధర్నాకు దిగారు. భోగాపురం ఐసీడీఎస్ పీవో కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బందికి, లబ్ధిదారులకు ఫేస్ యాప్ హాజరు రద్దు చేయాలని కోరారు. పాత పద్ధతిలోనే పౌష్టికాహారం, రేషన్ పంపిణీకి అనుమతి ఇవ్వాలన్నారు. ఎక్కువ యాప్‌లు కాకుండా ఒకటే యాప్ కొనసాగించాలని, తమపై పనిభారం తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఐసీడీఎస్ పీవోకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు కె.కొర్లమ్మ, వి.లక్ష్మి, ఎం.కృష్ణ, జి.ప్రవీన, కె.వరలక్ష్మి, కె.ఎ.కొండమ్మ, ఎ.తులసి, పి.రాములమ్మ, కె.లక్ష్మీకాంతం, టి.చంద్ర తదితరులు పాల్గొన్నారు. – భోగాపురం

పట్టాలు మంజూరు చేయండి..


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న భూపాలరాజపురం రైతులు

దత్తిరాజేరు: సుమారు 150 సంవత్సరాలుగా తాతా, ముత్తాతల నుంచి సాగు చేస్తున్న భూములకు సంబంధించి పట్టాలు మంజూరు చేయాలని భూపాలరాజపురం గ్రామానికి చెందిన రైతులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ విజయ్‌భాస్కర్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఇనాం, బంజరు పేరుతో ఉన్న సుమారు 270 ఎకరాల భూమిలో పంటలు పండిస్తూ, విక్రయించుకోవడానికి సుమారు 130 మంది రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కుటుంబ అవసరాలకు తనఖా పెట్టడానికి గాని, విక్రయించుకోవడానికి గాని కుదరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టి రైతులకు న్యాయం చేయాలని సర్పంచ్ నేరేడుబిల్లి గురునాయుడు, మాజీ సర్పంచ్ నీలకంఠం, రైతులు నారాయణరావు, సుధాకర్, మిత్తిరెడ్డి లక్ష్మి, అప్పలనాయుడు, తదితరులు కోరారు.

ప్రమాణ స్వీకారం ..

గజపతినగరం: గజపతినగరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా లెంక బంగారునాయుడు సోమవారం సాయంత్రం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం సభ్యులు కూడా ప్రమాణ స్వీకారం చేసి, అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పడాల అరుణ, ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు, బీజేపీ నాయకురాలు డాక్టర్ రెడ్డి పావని, మాజీ ఎంపీపీలు కొండపల్లి కొండలరావు, గంట్యాడ శ్రీదేవి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మక్కువ శ్రీధర్, సీనియర్ నేత గుంట్రోతు గోవిందరావు, ప్రదీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 15లోగా ప్రీమియం చెల్లించాలి..

శృంగవరపుకోట: పంటల బీమా పథకానికి సంబంధించి రైతులు ఆగస్టు 15లోగా ప్రీమియం సొమ్ము చెల్లించాలని వ్యవసాయ శాఖ కొత్తవలస సబ్ డివిజన్ ఏడీఏ భానులత అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్ఎస్‌కే సిబ్బందికి ఖరీఫ్ పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎకరా వరి పంటకు 200 రూపాయలు చొప్పున ప్రీమియం చెల్లించాలన్నారు.

అయోమయంలో అన్నదాతలు

- న్యాయం చేయాలంటున్న 'జిందాల్' నిర్వాసిత రైతులు


సమస్యలు చెబుతున్న జిందాల్ నిర్వాసిత రైతులు

శృంగవరపుకోట: జిందాల్ కంపెనీ ఏర్పాటుకు భూములిచ్చిన ఒక్కో రైతు కుటుంబానికి ఒక్కో కథ ఉంది. సమస్యలతో రైతులు ఆందోళన చెందుతుంటే, వీరి సమస్యలను పరిష్కరించి, మార్గదర్శకం వహించే అధికారులే కనిపించడం లేదు. రైతుల భూముల్లో జిందాల్ వేస్తున్న అడుగుల సవ్వడి అన్నదాతలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. మండలంలోని కిల్తంపాలెం పంచాయతీకి చెందిన రైతులు కొందరు 'మా కష్టాలు చూద్దురు.. మా ఊరికి రండి' అంటూ మీడియా ప్రతినిధులను పిలిచారు. దీంతో సోమవారం పలువురు మీడియా ప్రతినిధులు కొందరు రామన్నపాలెం వద్ద జిందాల్ సేకరించిన రైతుల భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ పరిశ్రమ వస్తుంది.. మీ జీవితాలు బాగుపడతాయ్.. అని చెబితే నమ్మి భూములిచ్చామన్నారు. ఇప్పుడు కంపెనీ రాదు.. పార్కులు పెడతాం.. భూములు వదిలేసి పొమ్మని బెదిరిస్తున్నారు. నిత్యం పోలీసుల్ని మా చుట్టూ పహారా కాయిస్తున్నారు.. మేము దేశద్రోహులమా.. దొంగలమా.. అని ప్రశ్నించారు. ఉద్యోగం అన్నారు లేదు.. జీతం ఇవ్వలేదు.. బోర్లు, నష్టపోయిన ఇళ్లకు పరిహారం కూడా అందలేదు.. ఇప్పుడు వరి, చెరుకు పంటలు వేశాం. పంట చేతికి వచ్చే సమయంలో పంటలు తీసేస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. పూర్వం నుంచి పండిస్తున్న భూములను వదిలేసి ఎక్కడికి పోవాలని రైతు మత్తి పెంటయ్య ప్రశ్నించారు. ఉద్యోగం ఇస్తామని చెప్పి మోసం చేశారని తానవరపు అప్పలనాయుడు అనే మరో రైతు వాపోయాడు. కంపెనీ ఏర్పాటు చేయలేదు కాబట్టి మా భూములు మాకు ఇవ్వాల్సిందేనని శిరికి స్వామినాయుడు, దేముడు, దారపురెడ్డి కన్నంనాయుడు, దారపురెడ్డి రాంబాబు, అప్పలనాయుడు, తదితరులు స్పష్టం చేశారు.

'మురుగు'పై ఆరా

శృంగవరపుకోట: 'కోట'లో మురుగు కంపు ఎట్టకేలకు జిల్లా అధికారులను తాకింది. స్థానిక ప్రజాప్రతినిధులకు కనిపించింది. పత్రికల్లో 'కోట'ను కమ్ముకున్న మురుగుపై ఎన్ని వార్తలు ప్రచురితమైనా ఏనాడూ ప్రభుత్వ అధికారులకు కనిపించలేదు. ఎట్టకేలకు ఆదివారం హోరున వర్షం కురుస్తుండగా ఎస్.కోట వచ్చిన డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణకు మురుగు కనిపించింది. దీంతో ఆయన వెంటనే డీపీఓ, కలెక్టర్లకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. దీంతో డీపీఓ డోల మల్లికార్జునరావు సోమవారం ఉదయం ఎస్.కోట వచ్చి పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ.. గతంలో ధారాళంగా నీరుపోయే పరిస్థితులు ఉండేవన్నారు. వాటికి అడ్డంకులు సృష్టించడం వల్లే ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. ప్రధాన రహదారికి రెండు వైపులా డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, ఈఓపీఆర్‌డీ లక్ష్మి, ఎస్.కోట ఈఓ అనురాధ, తదితరులు ఉన్నారు.


ఎస్.కోట రోడ్డును పరిశీలిస్తున్న డీపీఓ డోల మల్లికార్జునరావు